

# వెలుతురులోకి

సరస్వతికి చీకటిగదిలోంచి బయటికి రావాలనిపించదు. వెలుగు చూడాలనిపించదు. చీకటిగదిలో మంచం మీద పడుకుని ముఖం మీద దుప్పటి కప్పుకుని ఇంకా ఇంకా చీకటిలోకి కూరుకుపోతుంది. వెలుతురు చూడటం చాలా కష్టంగా ఉంటోందామెకు. వెలుతురంటే చీకటి ఆమెకు. వెలుతుర్లోకి, మేలుకున్న ప్రపంచంలోకీ వెళ్ళటమంటే చీకట్లోకి వెళ్ళినట్లుగా ఉంటుందామెకు. అక్కడంతా తడుములాటే. ఏదీ కనపడని వెతుకులాటే. ఎటు అడుగు వేస్తే ఏ గోతిలో పడతానో అనే భయమే. అనుక్షణం ఆసరా కావాలక్కడ. చేతి కర్రలా తను పట్టుకోడానికి ఒక మనిషి కావాలక్కడ. ఆ మనిషి మనిషిగా ఉంటే ఎంత బాగుండేది.

కానీ, ఆ మనిషి కొండచిలువై పోయాడు. ఆ కొండచిలువను పట్టుకోక తప్పదు. వదలదు, వదలలేదు. కానీ, పట్టుకున్నది కొండచిలువననే స్పృహ అనుక్షణం తన వెన్నుపూసలోంచి శరీరమంతటికీ పాకుతూనే ఉంటుంది. భయం, జుగుప్స, కంగారు, దు:ఖం, నిస్సహాయత్వం అన్నీ కలిసి సరస్వతిని శక్తిహీనురాలిని చేస్తాయి. 'ఒద్దు - అందరూ

వెల్తురని పిల్చే ఆ చీకట్లోకి వెళ్ళొద్దు' అనుకుని మరింతగా దుప్పట్లోకి ముడుచుకుని ముఖం మీదికి దిండుని కూడా లాక్కుని అదుముకుంది.

ఆ చీకటి గదిలోంచి, ఆ దుప్పటి బరువులోంచి తన కనురెప్పల కింద పొగుపడ్డ చీకటినంతా చీల్చుకుని వెలుతురు లోకంలోకి ప్రయాణం చేస్తోంది సరస్వతి.

అక్కడ పట్టపగలు. ఎటు చూసినా సూర్యకాంతి. పెద్ద పెద్ద చెట్ల గుబురు కొమ్మల్లోగానీ, కిందగానీ చీకటన్నది లేదు. నీడ జాడే లేదు. అన్నీ తళతళా మెరిసిపోతున్నాయి. వెన్నెల్లాంటి చల్లని ఎండలో సేదదీరిపోతున్నాయి. మనసూ తనువూ కూడా. అక్కడ సరస్వతి చిన్నపిల్లలా స్వేచ్ఛగా తిరుగుతోంది. "తొలి కాన్పు ఆడపిల్లయితే లక్ష్మి అని పేరు పెట్టక సరస్వతి అని పెట్టారేమిటి?" ఎవరో అడుగు తున్నారు అమ్మా నాన్నలను. "లక్ష్మీదేవి అనుగ్రహం మాకు బాగానే ఉంది. సరస్వతీ కటాక్షం కావాలని మా చిట్టితల్లికి ఆ పేరు పెట్టుకున్నాం". తండ్రికి తనంటే ఎంత ప్రేమ. తనను పెద్ద చదువులు చదివించాలని ఎంత ఆశ. తను చదువుతున్నంత సేపూ పక్కనే కూచునేవాడు. తనని స్కూల్లో దిగబెట్టి మళ్ళీ సాయంత్రం తీసుకొచ్చేవాడు.

అమ్మ - అమ్మ తనచేత పూజలన్నీ చేయించేది. ఆ దేవుడి మందిరం ముందు ప్రమిదలలో దీపాలు వెలగటం ఎంత బాగుంది. ఆ దీపాల కాంతిలో తెల్లని నందివర్ధనాలు, ఎర్రని మందారాలు, మంకెన పూలు - సరిగ్గా సగానికి పగిలిన కొబ్బరిచిప్పలు, వెండిగిన్నెలో కొబ్బరి నీళ్ళు - హారతి పళ్ళెంలో కర్పూర పరిమళం.

తెల్లని తన కాళ్ళకు బంగారపు పూతలా పచ్చని పసుపు పూత. తన మెడకింద గంధం. తలంటుకున్న జుట్టులో విరజాజిపూల మాల వెదజల్లే వాసనలు.

ఎన్నో పూజలు చేయించేది అమ్మ. సన్నటి గొంతుతో వ్రత కథలన్నీ చెప్పేది. పండుగలు, పర్వదినాలలో రోజులు పరిగెత్తుతూ వెళ్ళిపోయాయి. అన్ని పూజల్లో, నోముల్లో వ్రతాల్లో తనకు పెద్దలనుంచి వచ్చే ఆశీర్వచనం మాత్రం ఒకటే - మంచి మొగుడు. ముత్తయిదుతనం. అనుకూలవతియైన భార్యగా, అరుంధతీ అనసూయల్లాంటి పతివ్రతగా గొప్ప జీవితం.

ఈ పూజలు తన జీవితంలో ఒక పార్శ్వమైతే, మరోపక్క నాన్న పాఠాలు చెప్పి చదివించేవాడు. తనకెంత జ్ఞాపకశక్తనీ - ఒక్కసారి చదివి ఇట్టే అప్పచెప్పేది ఏ పాఠాన్నయినా.

పెద్దదవుతోంది. పూజలు పెరుగుతున్నాయి. చదువులు పెరుగుతున్నాయి.

తను మాత్రం అట్లాగే - చిన్నపిల్లలాగే - చిలకతల్లిలాగే ముద్దుగా - ముచ్చటగా ఆ ఇంట్లో తిరిగేది.

బి. ఎ, ఎం. ఎ కూడా అయిపోయింది.

మా అమ్మాయి కలెక్టరు కావాలన్నాడు పిచ్చినాన్న.

కలెక్టరు కావాలంటే పాఠాలు బట్టీపెట్టడమూ,పూజలు చేయడమూ సరిపోవని తెలియదు నాన్నకి.

తనను ఒక వ్యక్తిగా మలచటం తెలియలేదు వాళ్ళకు. ఇల్లు కదిలితే నాన్న తోడు లేకుండా బయటికి రాలేని తను కలెక్టరు కావాలని నాన్న ఆశ.

చివరికి సివిల్ సర్వీస్ పరీక్షలు రాయాలి అని నిర్ణయించారు.

అమ్మ పెళ్లి చెయ్యాల్సిందేనని పట్టుపట్టింది.

సరస్వతికి ఒకవైపు ఈ పరీక్షలు. మరోవైపు పెళ్ళిచూపుల పరీక్షలు. ఆ పరీక్షలయిన మర్నాడే పెళ్ళి. పెళ్ళికొడుకు లాయరు. శాస్త్రోక్తంగా జరిగిపోయింది పెళ్ళి.

తన నోముల ఫలం. తన ముత్తయిదుతనం, తన పాతివ్రత్య పరాకాష్ఠ మంగళసూత్రం మెడలో పడింది.

భక్తిగా నమస్కరించింది భర్త పాదాలకు.

పచ్చటి ఆ పాదాలు అప్పుడు సరస్వతికి సాక్షాత్తు శ్రీరామ పాదాలు. ఆ పాదాలు పూజించాల్సినవనే గొప్ప గౌరవం మనసులో ఆ క్షణాన కలిగింది.

సంసారం సాగుతోంది చల్లగానే.

చల్లగానేనా? మొదటి రోజునే ఆ చల్లదనం తనకు వణుకు పుట్టించలేదూ. అతనికి, తన భర్త పార్థసారథికి తన చదువు మూలంగా, తనకు రాబోయే ఉద్యోగం మూలంగా తనను అనుమానించే హక్కు ఉందని తన చేత నమ్మించాడు. తనకు విపరీతమైన భయం పుట్టించాడు. ఆ భయంలోంచి తన మీద తనకు అపనమ్మకం. చాలా జాగ్రత్తగా ఉండాలనే హెచ్చరిక, ఎప్పుడెప్పుడు జారిపడతానోననే కంగారు వచ్చాయి. నిద్ర పడితే కలలో తను ఎత్తుమీద నుంచి పడిపోతున్నట్లు కలలు.

మెట్లు ఎక్కుతుంటే జారిపోతాననే భయం. అరికాళ్ళలోంచి వణుకు. మోకాళ్ళు బలహీన పడిపోతుంటాయి. అరచేతుల్లో చెమటలు కమ్ముతాయి.

ఆ భయానికి తనింకా అలవాటు పడకముందే ఉద్యోగం వచ్చింది.

అమ్మో - ఉద్యోగం వచ్చింది. అయ్యో - ఉద్యోగం వచ్చింది. వెల్తురు మాయమైంది. ఆ వెల్తురులోంచి ఎవరో బలంగా తంతే ఎగిరే బంతిలా సరస్వతి వేగంగా గదిలోని చీకట్లోకి వచ్చి పడింది.

ఇక ఇప్పుడంతా చీకటే.

లోపలా, బయటా అంతా చిమ్మచీకటి.

సూర్యోదయమైనా చీకటే, ట్యూబులైటు వెలిగినా చీకటే. గదిలో టక్కున లైటు వెలిగింది.

సరస్వతి ఆ వెల్తురు భరించలేక 'అబ్బా' అని అరిచింది.

"నాకు చీకటి పడదు. నీకు వెల్తురు పడదు సరే, నేను కాసేపాగి నా గదిలోకి పోతాలే".

పార్థసారథి సరస్వతి ముఖం మీద దుప్పటి లాగేశాడు. సరస్వతి కళ్ళలో భయం, జుగుప్స, నిస్సహాయత్వం వరుసగా మారుతూ వచ్చాయి.

"ఏంటా చూపు?" గద్దించాడు.

సరస్వతి కళ్ళు మూసుకుంది. క్రమంగా సరస్వతి నిర్జీవి అయిపోతోంది.

పార్థసారథి సరస్వతి శరీరంతో కాసేపు ఆడుకుని, లైటు తీసేసి తన గదిలోకి వెళ్ళి పోయాడు.

సరస్వతి దుప్పటికింద వెక్కిళ్ళు పెడుతూ పొగొట్టుకున్న వెల్తురు జ్ఞాపకాల్లో ప్రయాణం కోసం విఫలయత్నం చేస్తోంది.

లేదు - వెల్తురు వద్దు. ఒత్తిగిల్లి పడుకుంది.

మోకాళ్ళు ముడుచుకుంటుంటే, సరస్వతికి తను పచ్చగా పాకే పురుగులా మారిపోయినట్లనిపించింది. చాలా అసహ్యమైన పురుగు. ఏ చిన్న పుల్ల అడ్డం పెట్టినా, వెంటనే ఆగిపోయి చచ్చినట్లు పడి ఉంటుంది.

చిన్నతనంలో తన స్నేహితులు ఆ పురుగుల్ని చీపురు పుల్లల మీదికెక్కించి అవి వేలాడుతుంటే ఆనందించేవారు. తనకు ఆ పురుగుల మీద ఎంత జాలివేసేదో. ఇప్పుడు - ఇప్పుడు తనే పురుగు.

☆ ☆ ☆

ఆఫీసు గది నల్లని గుహ. ఫైళ్ళన్నీ ఎముకల పోగులు. ఆ టేబిల్‌మీద ఆకుపచ్చని పెన్ను విషపుకత్తి. ఆ కత్తితో తను హత్యలు చేస్తుంది. పార్థసారథి వచ్చి నరమాంస భక్షణ చేస్తాడు. పోగుపడ్డ ఎముకల్ని అల్మారాలో సర్దుతారు గుమాస్తాలు.

తను పూజారి - నరబలి జరిపే పూజారి.

తన నుదుటి కుంకుమబొట్టు ఎర్రదనం చూసుకుని భయపడింది సరస్వతి.

పనిలేదు. పనంతా సాయంత్రం పార్థసారథి చేస్తాడు. ఏ ఫైళ్ళమీద సంతకాలు పెట్టాల్సిందీ, ఎవరికి అనుకూలంగా సంతకాలు పెట్టాల్సిందీ, ఏ ఫైళ్ళను నిరంతరంగా పెండింగులో ఉంచాల్సిందీ పార్థసారథి చూస్తాడు.

మంత్రిగారితో పార్థసారథే మాట్లాడతాడు. సాయంత్రం క్లబ్బుల్లో జరిగే పార్టీలకు పార్థసారథే వెళ్తాడు.

పార్థసారథి పెట్టమన్న ఫైళ్ళమీద సంతకం పెట్టి వాటిని సమర్థించుకుంటూ, పార్థసారథి చెప్పమన్న మాటల్ని పైవారికీ కిందివారికీ చిలుక పలుకుల్లా అప్పజెప్పటమే తన పని. తన జ్ఞాపకశక్తి అమోఘం!

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఇదంతా పార్థసారథి తనకు చేస్తున్న సహాయమే అనుకుంది.

తోటి ఉద్యోగి వాణి చెప్పబోతే ఎంత అతిశయంగా సమాధానం చెప్పింది తను.

"ఆయనా నేనూ ఒకటే - ఆయన చెప్పినట్లే చేస్తాను. నా ఉద్యోగం, నా జీవితం అన్నీ ఆయనవే. "

వాణి ఎంత జాలిగా చూసింది తనవంక. ఆ తర్వాత ఎవరికీ తనతో చెప్పేంత చనువు ఇవ్వలేదు.

ఉద్యోగంలో మెట్లు చకచకా ఎక్కింది పదేళ్ళలో. మంత్రాలయం చేరింది. అంతా తన చలవేనంటాడు పార్థసారథి.

ముప్పయి మూడేళ్ళకే గొప్ప అధికారిణి.

ఎంత గొప్ప అధికారముంటే చుట్టూ అంత చీకటి.

ఉద్యోగం పెరిగేకొద్దీ పార్థసారథి పట్టూ పెరిగింది. చేతిని మాత్రం పట్టుకుందనుకున్న కొండచిలువ శరీరమంతా చుట్టుకుంది. ఆ బరువుతో తనెటూ కదల్లేదు.

అసహ్యం, అసహ్యం, తనంటే తనకు అసహ్యం. తన సంతకం అంటే అసహ్యం.

భర్త ఒప్పందాలు చేసుకుని నోట్లకట్టలు తీసుకొస్తే తను సంతకాలు పెడుతుంది.

సంతకం పెట్టనంటే తన పాతివ్రత్యం మంటగలిసిపోతుంది. భర్త మాట వినాలి. భర్తకి అనుకూలంగా నడుచుకోవాలి. భర్త చేయి పట్టుకుని నడవాలి. మనసా - వాచా - కర్మణా - చివరి రెండూ కుదురుతున్నాయి. మొదటిది కుదరటం లేదు.

అమ్మా - భర్త చెప్పినట్లు కాకుండా న్యాయంగా నడుచుకోమని ఎందుకు చెప్పలేదమ్మా?

నాన్నా - పెద్ద ఉద్యోగం చెయ్యటమంటే నిర్ణయాలు తీసుకునే శక్తి ఉండటమని నీకెందుకు తెలియలేదు నాన్నా?

మొన్నటికి మొన్న పార్థసారథి ఫిర్యాదు విని అమ్మానాన్నలు ముక్తకంఠంతో చెప్పారు.

"అతను తెలివైనవాడు. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. అతనేంచెబితే అది విను. సుఖపడతావు."

"నాకిక్కడ సుఖం లేదు" అంది సరస్వతి తెగించి.

అమ్మ భయపడిపోయింది. బావురుమనీ ఏడ్చింది.

ఆడదానికి భర్త తప్ప గతిలేదని మళ్ళీ మళ్ళీ చెప్పి భయపెట్టింది. చిన్నప్పుడు దయ్యం కథలు చెప్పి తనను భయపెడుతున్నాడని పెద్దమ్మ కొడుకుని కొట్టిన అమ్మ తననిప్పుడు ఎట్లా భయపెడుతోందో. తను వచ్చి మళ్ళీ సంతకాలు పెడుతోంది.

ఇట్లా సంతకాలు పెట్టేవాళ్ళు ఇంకా ఉంటారా? ఉండరు. ఎవరూ ఉండరు. తనే ఈ ప్రపంచంలో అసహ్యకరమైన పురుగు. సరస్వతి అసహనంతో టేబిల్ మీద పేపర్‌వెయిట్ తీసి నేలకేసి కొట్టింది.

అది చప్పుడు చెయ్యకుండా మెత్తటి తివాచీలోకి దిగబడిపోయింది.

లాభంలేదు - ఇక్కడ తన చిరాకుకి కూడా వ్యక్తీకరణ లేదు. చప్పుడు చెయ్యకుండా తలుపు తీసుకుని తన కింది ఉద్యోగి వచ్చాడు. ఏదో మాట్లాడాడు.

సరస్వతి వినలేదు. విన్నా మనసుకెక్కదు. అతను వెళ్ళిపోయాడు.

ఇంకొకామె వచ్చింది వెంకటగిరి చీరెలు పట్టుకుని. ఉద్యోగంతో పాటు వ్యాపారం కూడా చేస్తుందీమె. ప్రతి నెలా ఒక చీరన్నా ఇచ్చి వెళ్తుంది. పార్థసారథి ఎన్ని చీరెలు కొనుక్కున్నా ఏమనడు. హోదాకు చిహ్నం ఖరీదైన చీరెలు.

"మీకు ఉద్యోగం, వ్యాపారం రెండూ చేయటం కష్టంగా అనిపించటంలా?" చీరెల్ని తిరగేస్తూ అడిగింది సరస్వతి.

"ఇల్లు గడవాలంటే తప్పదు మేడం. కష్టపడాల్సిందే. ఇంకా మిషను కూడా కుడతాను. ఎంబ్రాయిడరీ లెండి. ఎంత సంపాదించినా మా ఆయన తాగుడికి సరిపోదు."

"ఏం చేస్తాడాయన?"

"ఏం చేస్తే ఏం? పైసా ఇంటికి తేడు. ముగ్గురు పిల్లల్ని చదివించాలి."

సరస్వతికి ఏం చెప్పాలో తెలియక రెండు చీరెలు తీసి పక్కన పెట్టింది.

అయినా సరే. ఆమే నయం తనకంటే. మొగుడి ప్రమేయం లేకుండా ఉద్యోగం, వ్యాపారం చేస్తోంది. పిల్లల్ని చదివించుకుంటోంది. ఆ భర్త దగ్గర, పిల్లల దగ్గర ధీమాగా నిలబడుతోంది. తను కనీసం తన ఉద్యోగం తను చెయ్యటం లేదు.

కొత్తగా ఆ సెక్షన్‌కి ట్రాన్స్‌ఫరై వచ్చిన ఉద్యోగి సరస్వతిని కలవటానికి వస్తున్నాడని స్టెనో చెప్పింది.

అతను వచ్చాడు. విష్ చేశాడు.

"నా పేరు అనిల్‌కుమార్. పోయినేడాది లేబర్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. ఇప్పుడిక్కడికి ట్రాన్స్‌ఫరై వచ్చాను."

సరస్వతి నిర్లిప్తంగా చూసింది. ఏమీ మాట్లాడలేదు. కూర్చోమని కూడా అనలేదు. అతను ఇబ్బందిపడి వెళ్ళిపోయాడు.

సరస్వతి ఏదో ఆలోచనలో పడిపోయింది.

సాయంత్రం అయ్యేదాకా ఇట్లాగే - సాయంత్రం పార్థసారథి వచ్చి తీసుకెళ్ళాడు.

☆ ☆ ☆

రాత్రి పొద్దుపోయాక షికార్లన్నీ ముగించుకుని పార్థసారథి వచ్చాడు. "వాడో పొగరుమోతు. నువ్వు జాగ్రత్తగా ఉండాలి. ఇంతకుముందు అట్లా పొగరుగా ఉంటేనే సెక్షన్ మార్చారట."

సరస్వతి అయోమయంగా చూసింది.

"నీకేదీ అర్థమై చావదు. మీ సెక్షన్‌కి కొత్తగా వచ్చాడే అనిల్‌కుమార్ వాడి సంగతి. ఇవాళ సాయంత్రం కలిశాను. యారొగెంట్ ఫెలో. చూస్తా."

ఏమైందో, రేటు ఎక్కువ చెప్పాడేమో, ఒప్పందాలు కుదరలేదేమో.

మర్నాడు ఆఫీసులో అనిల్‌కుమార్ వచ్చాడు.

ఫైలు తన టేబిల్‌మీద పెట్టి, తనవంక ఒకసారి చూసి ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

అతని చూపు అలా ఉందేమిటి?

ఆ చూపులో తన మీద అసహ్యం ఎంత స్పష్టంగా కనపడిందో.

ఏమిటతనికి తనమీద అంత శ్రద్ధ?

తనను అంత అసహ్యంగా ఇంతవరకూ ఎవరూ చూడలేదు.

తనను అసహ్యించుకునే వ్యక్తి ఇంతవరకూ ఈ ప్రపంచంలో తనొక్కతే.

అమ్మ, నాన్న, ప్రేమగా, అపురూపంగా చూస్తారు.

భర్త అధికారికంగా, గర్వంగా చూస్తాడు. ఒకోసారి నిరసన, చులకన కనపడతాయి అతని చూపుల్లో.

బంధువులు, పరిచయస్తులు అడ్మిరేషన్‌తోనన్నా చూస్తారు. అసూయగానన్నా చూస్తారు.

కింది ఉద్యోగులు జాలిగానూ, భయంగానూ చూస్తారు.

పై అధికారులు మనసులో ఏమన్నా గౌరవంగానే చూస్తారు. అసహ్యపడుతూ చూడరు.

అద్దంలో తన ప్రతిబింబమే తనను అసహ్యించుకునేది. అనుక్షణం తన అంతరాత్మే తనను అసహ్యించుకునేది.

ఇతనెవరు? తన ప్రతిబింబాన్నీ, అంతరాత్మనూ కలగలిపినట్లు ఇతని కళ్ళలో అంత అసహ్యం ఎందుకు తనమీద. తన మీద ఎవ్వరికీ శ్రద్ధ లేదనుకుంటే ఇతనేమిటి మధ్యలో.

పదిహేను రోజుల్లోనే సరస్వతికి, అనిల్‌కుమార్‌కి చాలా సార్లు పేచీ పడింది. ఈ పేచీలో సరస్వతి శ్రోత మాత్రమే. అతను ఆవేశంగా మాట్లాడుతుంటే అన్నీ వింటూ, వెళ్తూ వెళ్తూ అతను తనను అసహ్యించుకుంటూ చూసే చూపు కోసం ఎదురుచూస్తూ కూచునేది.

ఆ చూపు చాలా ఆత్మీయంగా తగులుతోంది మనసుకి. రెండు మూడురోజులు అనిల్‌కుమార్ కనపడకపోతే ఏదో మిస్సయినట్లు అనిపించసాగింది.

నెలరోజులు గడిచేసరికి పార్థసారథికి అనిల్‌కుమార్ సమస్యగానే తయారయ్యాడనిపించింది.

పదేళ్ళలో పార్థసారథిని అంత ఇబ్బంది ఎవరూ పెట్టలేదు. రోజు రోజుకూ అనిల్‌కుమార్ కళ్ళలో పెరుగుతున్న అసహ్యాన్నీ భర్తలో పెరుగుతున్న అసహనాన్నీ చూస్తుంటే సరస్వతికి పెళ్ళయిన ఇన్నేళ్ళకు మొట్టమొదటిసారి తనకు వినోదం కలిగించే సంఘటన ఒకటి జరిగినట్లనిపించింది.

సరస్వతి వీలైనంత వినోదం పొందుతోంది.

ఆ వినోదం కోసం అనిల్‌కుమార్ దగ్గర తన అలవాటుకి భిన్నంగాఎక్కువే మాట్లాడుతోంది.

భర్త పెట్టే వాదనలే పెడుతోంది. అతనిలో అసహ్యాన్ని పనిగట్టుకుని పెంచుతోంది. అనిల్‌కుమార్ రెండు మూడు నెలల వరకూ చాలా సహనంగా మాట్లాడాడు సరస్వతితో.

పనిగట్టుకుని ప్రతి ఫైల్‌కీ అర్థం పట్టాడు. సరస్వతి తనను మందలించినట్లు మాట్లాడితే ఎట్లా సమాధానం చెప్పాలో కూడా సిద్ధపడ్డాడు. కానీ, సరస్వతి ధోరణి వేరుగా ఉంటోంది. చివరికో రోజు అతను సహనం కోల్పోయే పరిస్థితి వచ్చింది. అతను గంటసేపు వివరంగా మాట్లాడాడు. సరస్వతి ఏమీ మాట్లాడలేదు.

"మీకు అర్థం కాలేదా? మళ్ళీ చెప్పమంటారా?"

"అర్థమైంది. నాకా విషయాలన్నీ తెలుసు". చాలా కామ్‌గా చెప్పింది.

"తెలిసీ ఎందుకిలా చేస్తున్నారు? ఒక బాధ్యతగల అధికారిగా ఎందుకు ప్రవర్తించరు?' అనిల్‌కుమార్ తన కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాడు. మాటలో, ముఖంలో కోపం ఎంత దాచిపెట్టాలన్నా దాగకుండా బయటపడింది.

సరస్వతి ఎర్రబడిన అతని ముఖాన్ని, కోపంతో నిండిన కళ్ళను చూస్తోంది. కోపం నుంచి అతని కళ్ళు అసహ్యాన్ని ఎప్పుడు నింపుకుంటాయా అన్నట్లు చూస్తోంది.

"చెప్పరేం? నన్నేమనుకుంటున్నారు? గంటసేపు నేను మాట్లాడితే నన్నోఫూల్‌ని చేసి నాకన్నీ తెలుసంటారేం?"

సరస్వతి అతని కోపం పట్టించుకోలేదు. అతన్నే చూస్తూ హఠాత్తుగా అడిగింది.

"మీకు పెళ్ళయిందా?"

అనిల్‌కుమార్ బిత్తరపోయాడు. అతని కళ్ళలో చిరాకు చూసి సరస్వతికి నవ్వొచ్చింది. అనిల్ లేచి నుంచున్నాడు.

"కూచోండి మీకు పెళ్ళయిందా?"

"అయింది" కూచోకుండానే పళ్ళబిగువున సమాధానం ఇచ్చాడు.

" మీ భార్య ఉద్యోగం చేస్తోందా?"

"చేస్తోంది". అనిల్‌కి పిచ్చెక్కేలా ఉంది.

తనింతసేపూ చెప్పిందేమిటి? ఈవిడ తీరిగ్గా వాళ్ళింటి డ్రాయింగ్ రూంలో వేయాల్సిన కుశల ప్రశ్నలేమిటి?

"ఏం ఉద్యోగం"? సరస్వతి కంఠం ఎప్పటిలా మృదువుగా, మెత్తగానే అడుగుతోంది.

"బ్యాంక్‌లో - ఆఫీసరు".

ఈ సంభాషణ ఎంతదూరం పోతుందో అంత దూరమూ తానూ వెళ్ళదలుచుకున్న వాడిలా కుర్చీలో కూచున్నాడు అనిల్.

"ఆమె ఎవరికి లోన్లివ్వాలో, ఎవరికి ఓ. డి లివ్వాలో , ఎవరికి ఫేవర్ చెయ్యాలో మీరు చెప్తారా?"

"చెప్పను. నేనెందుకు చెప్తాను. నాకేం పని. నా పని నేను చేసుకోలేక మీదగ్గిరిలా నానా పాట్లూ పడుతూంటే-" అనిల్‌కి మళ్ళీ కోపం మొదలయింది.

"మా ఆయనలా కాదు. అన్నీ తనే చెబుతాడు. ముఖ్యమైన నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటాడు. ఆయన లాయరు. ఆయనకు అన్నీ తెలుసు. నేను ఆడదాన్ని, అమాయకురాలిని. అందరూ మోసం చేస్తారు. ఇట్లాంటి పెద్ద ఉద్యోగాల్లో మగవాళ్ళ సాయం లేకుండా నెగ్గుకురావటం ఆడవాళ్ళ వల్ల అవుతుందా? అందుకని ఈ విషయాలన్నీ మా వారితో మాట్లాడండి. మీ ఆవిడకు కూడా ఉద్యోగంలో సాయం చెయ్యండి" అనిల్‌కుమార్ కళ్ళలో ప్రతిఫలించబోయే తీవ్రమైన అసహ్యం కోసం ఆశగా చూసింది సరస్వతి.

సరస్వతి తన స్వభావానికి విరుద్ధంగా బిట్టర్‌గా నవ్వింది. అనిల్‌కుమార్ కళ్ళుమూసుకున్నాడు. వెంటనే లేచి వెళ్ళిపోటానికి తలుపు వైపు నడిచాడు.

తలుపు తెరవబోయి, ఏదో అనుమానం వచ్చి ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

సరస్వతి టేబిల్ మీద తల వాల్చింది. ఆమెభుజాలు ఎగురుతున్నాయి గానీ, అది నవ్వులా లేదు.

అనిల్ వెనక్కు వెళ్ళాడు. సరస్వతి ఏడుస్తోంది.

"మేడమ్-"

ఆమె తలెత్తలేదు. ఏడుపు ఆగటం లేదు. అనిల్ టేబిల్ మీద నుంచి వంగి రెండు చేతులతో ఆమె తల పట్టుకుని బలవంతంగా పైకి లేపాడు.

సరస్వతి చప్పున లేచి నుంచుని అనిల్ చేతుల్లోంచి తలను వదిలించుకుని అతనికేసి భయంగా చూస్తోంది.

"ఏడవకండి" అనిల్‌కి ఆమె ప్రవర్తన ఆశ్చర్యంగానూ, జాలిగానూ ఉంది.

"మీరు వెళ్ళండి" కంగారుగా అన్నది.

"మీరు ఏడుపాపండి వెళ్తాను" అతని కళ్ళల్లో జాలి చూస్తే సరస్వతికి కోపం ముంచుకొచ్చింది. ఇక ఇతనూ జాలి కురిపిస్తాడు కాబోలు.

"ఇదే నా డ్యూటీ. రోజూ ఈ గదిలో ఏడవటమే నా డ్యూటీ" సరస్వతికి ఏడుపు తన్నుకొస్తోంది.

అనిల్ మళ్ళీ ఆమెను పట్టుకుని కూర్చోబెట్టే ప్రయత్నంలో చేతులు ముందుకు కదిలించాడు. సరస్వతి భయపడుతూ ఇంకా వెనక్కు జరిగింది.

"ఎందుకలా భయపడుతున్నారు? నేనేమీ చెయ్యను. మీరు రిలాక్స్ అవండి. కళ్ళు తుడుచుకోండి."

సరస్వతి గబగబా కళ్ళు తుడుచుకుంది.

అనిల్ మంచినీళ్ళు గ్లాసులో పోసి ఆమె నోటి దగ్గర పెట్టాడు.

"తాగండి మీ చేతులు వణుకుతున్నాయి. పారబోసుకుంటారు."

గ్లాసు పెదవులకానించాడు. సరస్వతి కళ్ళు మూసుకుని మంచినీళ్ళు తాగేసింది. అనిల్ గ్లాసు టేబిల్ మీద పెట్టి"మీరు ఇంటికి వెళ్తారా" అనడిగాడు జాలిగా.

"వెళ్ళను . మీరు మీ సీట్లోకి వెళ్ళండి"

అనిల్ ఒక నిట్టూర్పు విడిచి తన సీట్లోకి వెళ్ళి పోయాడు. సరస్వతికి అంతా అయోమయంగా ఉంది.

'ఇదంతా పార్థసారథికి తెలిస్తే - అనిల్‌కుమార్ తన కన్నీళ్ళు తుడిచి మంచినీళ్ళు తాగించాడని తెలిస్తే - తన చుట్టూ ఇనుపగోడలు కట్టేశాడు పార్థసారథి. ఆ గోడల వెనుక భద్రంగా ఉంటావని చెప్పాడు. తను అట్లాగే ఉంటోంది. ఈ అనిల్‌కుమార్‌కి తన చుట్టూ ఉన్న ఇనుపగోడల గురించి తెలియక తనను పట్టుకున్నాడు.

ఈ సంగతి తెలిస్తే -

సరస్వతికి మనసులో విపరీతమైన అలజడిగా ఉంది.

☆ ☆ ☆

నాలుగు రోజుల తర్వాతగాని అనిల్‌కుమార్ మళ్ళీ సరస్వతికి కనిపించలేదు. ఈ సారి ఫైలంతా సిద్ధం చేసుకుని సరస్వతి సంతకం కోసమే వచ్చాడు. ఫైలు సరస్వతి ముందు పెట్టి, కావలసిన వివరాలన్నీ చెప్పి "మీరు సంతకం చెయ్యండి" అన్నాడు.

ఫైలు వంక చూసింది ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకం పెట్టవద్దని పార్థసారథి మరీ మరీ చెప్పిన ఫైలదే. అనిల్‌కుమార్ వంక నిస్సహాయంగా చూసింది.

"నేను పెట్టను - పెట్టలేను"

అనిల్‌కుమార్ చివ్వున లేచాడు.

"మీకు సిగ్గు లేదూ? ఉద్యోగం చేస్తున్నది మీరు కాదూ ?" మళ్ళీ అతని కళ్ళలో అసహ్యం.

ఆ అసహ్యం అంటే తనకెందుకంత ఇష్టం? ఆ అసహ్యం వల్ల అతను తనకు దగ్గరవుతున్నాడా? ఆత్మీయుడవుతున్నాడా? సరస్వతి అతని కళ్ళలోకి అదేపనిగా చూస్తోంది.

"ఈ సంతకం పెడితే మీవారేం చేస్తారు?"

"ఏమో?"

" ఏం చేస్తారో కూడా తెలియకుండా మీరెందుకిలా చేస్తున్నారు?"

సరస్వతి మాట్లాడలేదు.

అనిల్‌కుమార్‌కి ఒళ్ళు మండిపోయింది.

"పెద్ద పతివ్రతననుకుంటున్నారా? మీకంటే వేశ్య, పచ్చి వ్యభిచారిణి నయం. తన తిండి కోసం ఒళ్ళమ్ముకుంటుంది. మీకు ఏం లోటొచ్చిందని ఆ మొగుడికి ఒళ్ళు, వ్యక్తిత్వం అన్నీ అమ్మేసుకున్నారు. మీ మీద మీకు అసహ్యంగా లేదూ? ఎందుకట్లా బతకటం, ఈ ఉద్యోగం చెయ్యటం? ఏమైనా సరే మీరీ ఫైలు మీద సంతకం చేసి తీరాలి. ఎట్లా చెయ్యరో చూస్తాను."

విసురుగా లేచి వెళ్ళిపోయాడు.

సరస్వతి ముఖం తెల్లగా పాలిపోయింది. చెమటలు పట్టి కళ్ళు తిరిగినట్లయింది. క్రమంగా స్పృహ పోతున్నట్లుగా అనిపించింది. సర్వశక్తులూ కేంద్రీకరించి చైతన్యం తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. పోట్లాడుతోంది మనసూ శరీరం మీద.

'ఇదేంటి - ఇలా ఉంది'

క్రమంగా పాలిపోయిన ముఖంలోకే రక్తం వచ్చి చేరుతోంది. చైతన్యం సర్వావయవాల్లో - అతనేమన్నాడు? "వేశ్య నయం." తను వేశ్య - వేశ్య కాదు. వేశ్య కంటే ఘోరం.. వేశ్య. వేశ్య. కానీ ఇదేమిటీ? తనకేం బాధ కలగటం లేదేం? చాలా తేలిగ్గా అవుతోంది మనసు. గుండె మీది నుంచి ఏదో బరువు దింపిన భావన.

పతివ్రత కాదు తను. కాకపోతే ఎంత బాగుంది. ఈ సంతకాలు పెట్టనక్కర్లేదు. తను వేశ్య.

సరస్వతికి నవ్వొస్తోంది.

తనెక్కడ వ్యభిచరిస్తుందోనని కాపలా కాసే భర్తతోనే తను వ్యభిచారం చేస్తోందా?

పాతివ్రత్యానికీ, వ్యభిచారానికీ, తేడా ఏమిటి? ఏమిటని అనుకుంటోంది ఇన్నాళ్ళుగా తను? ఆ మాటల గురించి ఆలోచించిందా ఎన్నడైనా?

ఎందుకో హఠాత్తుగా సరస్వతికి వాళ్ళమ్మ పసుపు గుడ్డలో దేవుడికి ముడుపుగట్టి ఏళ్ళ తరబడి దేవుడి మందిరంలో దాచే చిల్లర నాణాలు గుర్తొచ్చాయి.

ఆ ముడి విప్పకుని నాణాలు కింద పడి పిండి పిండవుతున్నాయి. సరస్వతికి వెన్నుపూసలో చిత్రంగా ఏదో కదిలినట్లయింది. ఒళ్ళంతా ఒక కుదుపు కుదుపిన అనుభూతి.

వేశ్య -పతివ్రత, వేశ్య - పతివ్రత, వేశ్య - పతివ్రత అనే మాటలు ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి.

☆ ☆ ☆

సాయంత్రం మెల్లిగా రాత్రయింది. సరస్వతి చీకటి వెలుగులకు అతీతంగా తన లోకంలో నిరామయమైన మానసికావస్థలో ఉంది. లైటు బలవంతంగా వెలగటం ఇష్టం లేనిదానిలా వెలిగింది. పార్థసారథి అప్పుడే బయటనుంచి వచ్చాడు.

"ఏంటీ - ఆ అనిల్‌కుమార్ ఆ ఫైలు విషయంలో పంతం పట్టాడట."

"నువ్వు మాత్రం సంతకం చెయ్యకు. వాడి సంగతి నేను చూసుకుంటాను." సరస్వతి తనకే తెలియని వేగంతో అడిగింది.

"పోనీ చేసేస్తాను . ఏం?"

చాలా అరుదుగాప్రయోజనం లేదని తెలిసీ అడిగే ప్రశ్న.

"నీకు తెలియదు. నేను చెబుతున్నాగా."

"ఈ ఒక్కసారికి చేసేస్తాను." అతి దీనంగా పలికింది ఆమె గొంతు.

"అంటే, నా మాట లెక్కలేదని, వాడు చెప్పినట్లు చేస్తావా?"

"ఈ ఒక్క ఫైలు విషయంలో."

పార్థసారథి దగ్గరకొచ్చి సరస్వతి జుట్టు పట్టుకుని ముఖం పైకెత్తి చూశాడు.

"ఏం వాడంత నచ్చాడా? వాడి మాట కాదనలేకపోతున్నావా?"

సరస్వతికి ఊపిరి ఆడలేదో క్షణం.

"నేను వింటూనే ఉన్నాను. గంటలు గంటలు వాడు నీ గదిలో తిష్ఠ వేస్తున్నాడట. ఎందాకా వచ్చింది వ్యవహారం?'

పార్థసారథి గిలగిల కొట్టుకుంటున్న పక్షిని చూసిన వేటగాడి కళ్ళతో గుచ్చి గుచ్చి చూస్తున్నాడు సరస్వతిని. అతని కంఠంలో ఇది తిరుగులేని బాణం అని తెలిసిన నిస్సంకోచపు విజయగర్వం తొణికిసలాడుతోంది.

"రేపు ఆ ఫైలు తిప్పి పంపు."

తుది నిర్ణయం చేసేసి వెళ్ళి పోయాడు.

సరస్వతి విహ్వలంగా చూస్తోంది. చాలాసేపు అలాగే కూచుని, ఇక భరించలేనట్లు లైటు తీసేసి మంచం మీద పడుకుని దుప్పటి, దిండు కళ్ళమీద వేసుకుంది.

'చీకట్లోంచి వెలుగులోకి పోవాలి. అమ్మో వెలుగు కావాలి - త్వరగా నేను భరించలేను.

ఇదేమిటి - చీకటి కాదు వెలుగూ కాదు - పురుగు. అదే - ఆ పచ్చ పురుగు గిలగిలా కొట్టుకుంటోంది, కొండచిలువ నాలుక మీద. నోరు పెద్దగా తెరచిన కొండచిలువ. ఆ నాలుక - అది నాలుకేనా? ఇక చప్పరిస్తుందా? చప్పరిస్తే హాయి, పురుగు హింసకు విముక్తి - కొండచిలువా, చప్పరించవా?

కానీ, రెండు దవడలూ భీకరంగా తెరిచి కొండచిలువ అట్లాగే పురుగుని భయపెడుతూ ఉంది.

మింగదు. మింగదుగాక మింగదు. మింగితే దానికి ఆనందం లేదు.

సరస్వతి కళ్ళింకా గట్టిగా మూసుకుంది. కొండచిలువ నుంచి దూరంగా పోయి వెలుతురు కోసం వెతుకుతోంది. శూన్యంలో చూపు దూసుకుపోతోంది. చూపు వెంటపడి ఆ చీకట్లోకి కొండచిలువా వస్తోంది.

వేగం - వేగం - ఇంకా త్వరగా.

అమ్మయ్య - కొండచిలువ మాయమయింది.

అమ్మయ్య - కానీ, పురుగింకా అలాగే ఉందేం?

పురుగు గిలగిలా కొట్టుకుంటూనే ఉంది.

అబ్బా - ఎంతసేపు? నాతోట, నా చల్లని ఎండ, నా వెచ్చని వెన్నెల కనపడవేం? ఊఁహూ - పురుగు అలాగే యాతన పడుతోంది. అబ్బా - అదే కొట్టుకోవటం? అదేమిటా కదలిక? అది చిత్రహింసపడుతూ గిలగిలలాడుతోందా? పరమానందపడుతూ నృత్యం చేస్తోందా?

అదేమిటా కదలిక - తోకమీద లేచి నుంచుందా? పల్టీలు కొట్టి పడి పోతోందా? అమ్మో - భరించలేను. అసాధ్యం.'

'సరస్వతి కళ్ళు తెరిచిందో, తెరిచాననుకుందో -

ఆ చిన్ని వెలుతురుపిట్ట ఆమె కళ్ళలోంచి గదిలోకి ఎగిరిందో - బయట తోటలోంచి గదిలోకి వచ్చిందో.

ఎగురుతోంది. హాయిగా రెక్కలల్లారుస్తూ, కళ్ళు విప్పార్చుకుని చూస్తూ ఉండిపోయింది. చూస్తూ చూస్తూ ఉండగానే గది నిండా లెక్కలేనన్ని పిట్టలు, వందలు - వేలు - చిన్ని చిన్ని వెలుతురు పిట్టలు ఎగురుతున్నాయి. ఆ రాత్రంతా ఆమె అలా కళ్ళు విప్పార్చుకుని ఆ పిట్టల్ని చూస్తూనే ఉంది.

☆ ☆ ☆

తెల్లగా తెల్లవారాక నిద్రపట్టింది సరస్వతికి. తొమ్మిదవుతుండగా పనిపిల్ల వచ్చి లేపింది.

"అయ్యగారు పిలుస్తున్నారమ్మా."

"నాకు ఒంట్లో బాగోలేదు. ఆఫీసుకు సెలవు పెడతాను. అయ్యగారిని కోర్టుకి వెళ్ళమను."

సరస్వతికి ఒళ్ళంతా విరగ్గొట్టినట్టు ఉంది. కళ్ళు మండుతున్నాయి.

"జ్వరం వచ్చినట్టుంది" అంది పనిపిల్ల సరస్వతి చెయ్యి పట్టుకుని.

పార్థసారథి సరస్వతిని చూడకుండానే కోర్టుకు వెళ్ళిపోయాడు. సరస్వతి మళ్ళీ నిద్రపోయి పన్నెండింటికి లేచింది. జ్వరం విడిచిందేమో ఒళ్ళంతా చెమటపట్టి చిరాగ్గా అనిపించిందామెకు. లేచి స్నానం చేసింది. సత్తెమ్మ రొట్టె, పాలు తెచ్చింది.

"జ్వరంగా ఉంది గదా - అన్నం తినకండమ్మా" అంది.

నాలుగు రొట్టెముక్కలు తిని, పాలు తాగాక మళ్ళీ ఒళ్ళు స్వాధీనంలోకి వచ్చినట్లనిపించింది.

సరస్వతి ఆఫీసుకి ఫోను చేసింది. అనిల్‌కుమార్‌ను పిలిచింది.

"ఇంటికెందుకు?" అతని గొంతులో ఏదో అనుమానం. పార్థసారథి ఎంతకైనా తెగిస్తాడని అతని నమ్మకం.

"నాకు ఒంట్లో బాగాలేదు. జ్వరంగా ఉంది. ఆ ఫైలు మీద సంతకం చేసేస్తాను. ఇంకా ఆలస్యం కావటం నాకిష్టం లేదు."

"జ్వరం తగ్గాక, ఆఫీసుకు వచ్చాక చేద్దురుగాని - తొందరేముంది - ఇన్నాళ్ళు ఆలస్యమైంది. మరో రెండు రోజులు......."

"కాదు - నాకు జ్వరం తగ్గకపోవచ్చు. నేనింక ఆఫీసుకి రాకపోవచ్చు ఏమైనా జరగచ్చు. నేను మాత్రం ఈ పని చేసి తీరాలి. దయచేసి మీరు రండి".

అనిల్‌కుమార్ ఫోను పెట్టేశాడు.

మరో అరగంటలో అతను సరస్వతి గదిలో సోఫామీద కూచుని ఉన్నాడు.

అతనొచ్చి కూర్చున్న తర్వాతే సరస్వతి నీరసంగా మంచం మీదినుంచి లేచింది. అనిల్‌కుమార్ పక్కనే సోఫాలో కూచుంది.

అనిల్ బ్రీఫ్‌కేస్ తెరిచాడు. ఫైలు బయటికి తీశాడు.

"నన్ను చూస్తే మీకు అసహ్యం కదూ."

పేలవంగా నవ్వింది సరస్వతి.

అనిల్‌కుమార్ ఇబ్బంది పడుతూనే చెప్పాడు.

"అదేం కాదు మీరు ఇంత చదివి, ఇంత పెద్ద అధికారిగా ఉంటూ మరీ బానిసలా బతకటం ఏమిటని నా ప్రశ్న. మీ బానిసత్వం - పోనీ పాతివ్రత్యం వల్ల మీరొక్కరే బాధపడితే అది వేరే సంగతి. కానీ, చాలా అన్యాయాలు జరుగుతున్నాయి. మీ నిర్ణయాల వల్ల జరిగే దారుణాలు మీరూహించలేరా? ప్రజలకు సంబంధించి తీసుకునే నిర్ణయాల్లో మీ పాతివ్రత్యం చొరబడటం........" అనిల్ ఎక్కువ మాట్లాడుతున్నాననిపించి ఆగిపోయాడు.

"మగవాళ్ళు మాత్రం అన్యాయాలు చేయటం లేదా? లంచాలు తీసుకోవటం లేదా?'

"తీసుకుంటున్నారు. నేను కాదనటం లేదు. అందరూ పవిత్రంగా ఉన్నారని నేననటం లేదు. కానీ, వాళ్ళా పనులు వాళ్ళ ఇష్టంతో చేస్తున్నారు. వాళ్ళ పనులకు వాళ్ళే కర్తలు. వాళ్ళే బాధ్యులు. మీ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మీరు మీ ఇష్టంతో చేస్తున్నారా? మనసుని చంపుకుని చేస్తున్నారు. ఎందుకట్లా చెయ్యటం?"

"నేనట్లా అలవాటయ్యాను. ఆడవాళ్ళు భర్తల ఇష్టప్రకారం చెయ్యక తప్పుతుందా?'

"అది చాలా ఘోరం. ఆడవాళ్ళు భర్త మాట వినటం పూర్వం రోజుల్లో సరిపోయేదేమో నాకు తెలియదుగానీ - ఇప్పుడు వాళ్ళు బయటికొచ్చి ఉద్యోగాలు చేస్తున్నప్పుడు, ఇంత బాధ్యత గల ఉద్యోగాలు చేస్తున్నప్పుడు, భర్త మాట వినటం, పాతివ్రత్యం ఇవేవీ నడవవు. అది వాళ్ళ వ్యక్తిగత జీవితం మాత్రమే కాదుగదా. మీ జీవితాన్ని దాటి మీ నిర్ణయాలు బయటికి వస్తాయి."

అనిల్‌కుమార్ నచ్చజెబుతున్నట్లు మాట్లాడుతున్నాడు.

"నేను వేశ్యకంటే ఘోరమంటారు."

బిగ్గరగా నవ్వింది సరస్వతి.

"సారీ - మీరు బాగా హర్ట్ అయ్యారనుకుంటా. కానీ నాకు నిజం చెప్పటం అలవాటు. మీరు బాధపడినా సరే మీ జీవితం మాత్రం అంతకంటే దారుణంగా ఉంది" జాలిగానే అన్నాడు అనిల్.

"పార్థసారథి కూడా నా గురించి అలాగే అన్నాడు" అనిల్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఈ ఫైల్‌మీద సంతకం పెడితే మీకూ, నాకూ సంబంధం ఉన్నట్లు........అక్రమ సంబంధం ఉన్నట్లు."

సరస్వతి నవ్వు చిన్నగా మొదలై క్రమంగా పెరిగింది.

"ఊరుకోండి - ఐ యామ్ సారీ. నిజంగా ఆడవాళ్ళ పరిస్థితి ఇంత భయంకరమని నాకు తెలియదు". అనిల్ ముఖంలో ఆందోళన.

"నాకూ తెలియదు, నాకూ తెలియదు. ఇంకా ఎంతెంత భయంకరమో అనే భయంతో ఇట్లా బతుకుతున్నాను. కానీ, ఇంతకంటే భయంకరంగా ఉంటుందా? ఉండదు. ప్రభుత్వంతో వ్యభిచరించటమా? భర్తతో వ్యభిచరించటమా? ఏది మంచి దంటారు?"

నవ్వూ, దుఃఖమూ కలగలసి సరస్వతి కళ్ళలో నీళ్ళు కిందికి జారాయి. చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది. అనిల్‌కుమార్ నిస్సహాయంగా చూస్తుండిపోయాడు. సరస్వతే తేరుకుంది.

"ఇప్పుడు నా దగ్గరకొచ్చి కన్నీళ్ళు తుడవలేదేం? భయపడ్డారా?" అమాయకంగా అడుగుతున్న సరస్వతిని చూస్తే అనిల్‌కి దుఃఖం గుండెల్లోంచి పెల్లుబికింది.

"నేను వేశ్యనవ్వనా. పవిత్రంగా ఉండనా అన్న ప్రశ్న రేపారు మీరు. కానీ, ఆరెంటికీ తేడా ఉందా? లేదు." సరస్వతి మాటలు వింటుంటే అనిల్‌కి భయం వేసింది.

"ప్లీజ్ - ఆ మాటలన్నీ మర్చిపొండి. చాలా తెలివితక్కువగా - ఏదో హీరోలా మాట్లాడాను. నన్ను క్షమించెయ్యండి మీరే ఫైల్ మీద కూడా సంతకం పెట్టొద్దు. నేను మీ విషయంలో తలదూర్చి ఇకమీదట బాధపెట్టను. ఈ దేశంలో అంతా అవినీతే - కుటుంబమేమిటి, ప్రభుత్వమేమిటి - అంతా అవినీతే. అందరం అందులో కూరుకుపోయి ఉన్నాం. నేను మిమ్మల్ని ఎందుకు హింసించాలి? ఇదంతా మర్చిపొండి." అనిల్ బ్రీఫ్‌కేస్ తెరిచి, ఫైలు అందులో పెట్టి మూసేశాడు.

"వెళ్తాను." లేచి నిలబడ్డాడు.

సరస్వతి తొట్రుపాటుతో లేచింది.

"వద్దు వెళ్ళకండి. సంతకం చేస్తాను" అనిల్‌కుమార్ చెయ్యిపట్టుకుని ఆపింది.

మనిషి నిలువెల్లా వణుకుతోంది. వణుకుతున్న చేతిని అనిల్ భుజంమీద వేసి ఊతంగా పట్టుకుంది.

అనిల్ చాలా కంగారు పడుతున్నాడు.

"ఏమైంది మీకు ? ఎందుకలా అవుతున్నారు? ఏమీ అవదు. ఈ ఫైలుతో ఈ ప్రపంచం తలకిందులవదు. రిలాక్స్" ఆమె భుజాల మీద చేతులు వేసి, ఆమెను కూచోబెట్టే ప్రయత్నం చేశాడు.

"అనిల్" అంటూ సరస్వతి అనిల్ నుదుటి మీద ముద్దు పెట్టుకుంది.

వణుకుతున్న చేతుల్లోకి బలమంతా తెచ్చుకుని అనిల్‌ని బలంగా కౌగిలించు కుంది.

అనిల్ తల తిరిగిపోయింది.

'ఏమిటిది? ఏం చేస్తోందీవిడ?"

"అనిల్, నేనీ పాతివ్రత్యంతో ఉండలేను. ఉండలేను."

అనిల్ వెర్రిగా చూస్తున్నాడు.

సరస్వతి ఆవేశంతో అతన్ని చుట్టేస్తోంది.

అదేమిటో ఆమెకే తెలియని ఉన్మాదస్థితిలో ఉన్నట్లుంది.

"మీరు నావంక అసహ్యంగా చూస్తారే.....ఆ చూపంటే నాకెంతో ఇష్టం తెలుసా? నన్నెవరూ అలా చూడరు. నన్ను నేనే చూసుకుంటున్నట్టు ఉంటుంది. అట్లా చూడండి. ఇప్పుడట్లా చూడండి."

అనిల్‌ని తనకేసి అదుముకుంటోంది.

క్రమంగా అనిల్ అయోమయం పోతోంది.

సరస్వతి ముఖంలోకి ఆప్యాయంగా, స్నేహంగా చూసి ఆమె పెదవులను గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

☆ ☆ ☆

ఓ గంట తర్వాత సరస్వతి తన జీవితంలో మొదటిసారి ధీమాగా, ధైర్యంగా, హుందాగా సంతకం చేసింది.

ఆ తర్వాత లాంగ్ లీవు కోసం అప్లయి చేసిన కాగితం అనిల్‌కుమార్‌కి ఇచ్చింది.

"నేను కొన్నాళ్ళు మా అమ్మానాన్నల దగ్గర ఉంటాను. వాళ్ళు ఉండనివ్వకపోతే హాయిగా దేశమంతా తిరుగుతూ, విడాకుల కోసం, ట్రాన్స్‌ఫర్ కోసం ఎదురుచూస్తూ నన్ను నేనొక మనిషిలా మలచుకుంటాను."

చాలా ప్రశాంతంగా, ధైర్యంగా చెబుతున్న సరస్వతిని చూసి స్నేహంగా నవ్వి బయల్దేరాడు అనిల్‌కుమార్.

*(1995, ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచిక)*